'ఈనాడు' నిర్వహించిన కథల పోటీలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ

# ముడుపు

"నందనరావు గారి ఇల్లు ఎక్కడో చెబుతారా..." సంకోచిస్తూ అడిగాడు హేమంత్.

"కొంచెం ముందుకెళ్ళి కుడిచేతి వైపుకి తిరుగు, పాతిక, ముప్పై అడుగులేశాక తూర్పుకి తిరిగితే మూడో ఇల్లే. మనది ఏ వూరేంటీ?" కాలుస్తున్న చుట్టని నోట్లోంచి తీసి చేత్తో పట్టుకుని ఆరా తీశాడు ఆ వ్యక్తి.

"చెన్నయ్"

"కొంపతీసి వరాలమ్మ మనవడివా ఏంటి"

అవునంటూ తలాడించి ముందుకు నడిచాడు హేమంత్.

ఆ వీధిలోకి తిరగ్గానే ఇల్లు గుర్తు పట్టాడు. హుషారుగా అడుగులేశాడు.

ఇంటి ముందు కళ్ళాపి జల్లి ముగ్గు వేశారు. ముచ్చటగా అన్పించి ఆగి మరీ చూశాడు.

మెట్లెక్కి ఎత్తరుగు మీద కెళ్ళాడు. కాలింగ్‌బెల్ కోసం చూస్తోంటే ఒకమ్మాయి అతణ్ణి చూసి తుర్రుమంది.

అలివేలు నీళ్ళ చెంబుతో వచ్చింది. ముఖమంతా నోరు చేసుకుని నవ్వింది.

"ఇదేనా రావటం అమ్మా నాన్నా బాగున్నారా? కాళ్ళు కడుక్కో."

బూట్లు తీసేసి కాళ్ళు కడుక్కున్నాడు. టవల్తో తుడుచుకుంటూ లోపలికెళ్ళాడు.

"ఇన్నేళ్ళకి గుర్తొచ్చామన్నమాట!" చెక్క కుర్చీ ముందుకి జరుపుతూ అడిగింది.

"అదికాదత్తా బిజీగా ఉండి... బామ్మ..."

"ఓహో, మా కోసం కాదన్నమాట. బామ్మకోసం వచ్చావా. నానమ్మ కూచీ!"

నవ్వుతూ వేళాకోళమాడుతోంటే, "కాసిని కాఫీ నీళ్ళయినా ఇవ్వకుండా ఆ వంకర మాటలేంటే" అంటూ కర్ర సాయంతో వచ్చింది బామ్మ.

"ఇలా మనవడు అడుగుపెట్టాడో లేదో నీకలా తెలిసిపోయింది. నీవి పాము చెవులే అమ్మా" మురిపెంగా నవ్వింది అలివేలు.

"ఏరా భడవా, ఎలా ఉన్నావురా? మీ నాన్న బాగున్నాడా? ఉబ్బసం నిమ్మళించిందా? మందులు వాడుతున్నాడా లేదా? ఆచార్యులుగారిచ్చే లేహ్యాలు కషాయాలు బాగా

పనిచేయిస్తారా అంటే విన్పించుకోడు" తల నిమురుతూ అడుగుతోంటే ఆమె వంక కించిత్తు విస్మయంగా చూశాడు.

తెల్లచీర, తెల్లజాకెట్టు, ముగ్గుబుట్ట తల, పచ్చని దేహచ్ఛాయ, గుండ్రని ముఖం, ఎర్రని పొడుగ్గీతా తెల్లని అడ్డగీతా గల బొట్టు, మెడలో తులసిపూసల మాల, కళ్ళనిండా ఆప్యాయత... వయస్సు పైబడింది గానీ బామ్మ మారలేదు.

"కొత్తగా చూస్తున్నావేంట్రా?"

"నీకు ఒంట్లో బాగోలేదని డాడీ చెప్పారు, నన్ను చూడాలంటున్నావని పంపించారు."

"లేకపోతే నువ్వు రావు. మీ నాన్న పంపించడు. వాడో పెద్ద దొరాయె!"

"నీకోసమేదో ముల్లె దాచిందట మీ నానమ్మ దాన్ని నీకివ్వాలని అలా వంక పెట్టింది."

కూతురి మాటలకి నవ్వుకుంటూ, "ముందు తాగడానికేదైనా ఇచ్చి వేన్నీళ్ళు తోడవే స్నానం చేస్తాడు. ప్రయాణం చేసి అలసిపోయాడు బిడ్డ" అంది.

"అదిగో నీ మనవరాలు మాటల్లోనే తెచ్చింది" గుమ్మం ప్రక్క నుంచి అందిస్తే అందుకుని తెచ్చిచ్చింది అలివేలు.

"నీ సిగ్గు బొగ్గులవ్వ. బావ దగ్గర సిగ్గెందుకే?!"

బామ్మ మాటలకి ఆ అమ్మాయి సంగతేమోగానీ హేమంత్ ఇబ్బందిగా కదిలాడు. గ్లాసుతో కాఫీ తాగటానికి మరింత ఇబ్బంది పడ్డాడు.

"మీ నానమ్మ చాలా గడుసుది. నిన్ను మాటల్తో మాయచేసి మనవరాల్ని కట్టబెట్టడానికి చూస్తుంది జాగ్రత్త. ఆ పల్లెటూరి సంబంధం చేసుకున్నావంటే ఇంతే సంగతులు. కూస్తంత కట్నం ప్రసాదంలా విదుపుతారు" వచ్చేముందు హెచ్చరించిన తల్లి మాటలు గుర్తొచ్చాయి.

"అలా ముడుచుకు పోయావేంట్రా. మీ అమ్మేమయినా నూరి పోసిందా?" కంగారుపడ్డాడు.

బామ్మ ఆవులించకుండానే పేగులు లెక్కపెట్టే రకం అనుకున్నాడు.

వెర్రిగా నవ్వాడు.

"నవ్వింది చాలుగానీ గదిలోకెళ్ళి తువ్వాలు కట్టుకురా, స్నానం చేద్దువుగాని".

మంచి బాలుడిలా బామ్మ చెప్పినట్టు చేశాడు.

వేడి వేడి ఇడ్లీల మీద ఇంత కమ్మని నెయ్యి పోసి కారప్పొడి కొబ్బరి చట్నీ వేసి పెట్టింది అలివేలు.

హేమంత్ పక్కనే చతికిలబడింది బామ్మ.

ఎవరూ లేకుండా చూసి అడిగింది "మీ నాన్నని మీ అమ్మ బాగానే చూసు కొంటోందా, ఉజ్జోగాలంటూ తెయ్‌మని ఊరేగుతోందా?"

"అహ, అలాటిదేం లేదు బామ్మా. అన్నీ మమ్మీయే అమర్చి ఆఫీసుకెళ్తోంది. నీ ఆరోగ్యం ఎలా ఉంటోంది?"

"కాటికి కాళ్ళు చాచుకున్నదాన్ని, నాకేం దొబ్బుడాయిగానీ నీకు సంబంధాలు చూస్తున్నారట కదరా".

"ఏవో చూస్తున్నారు" సిగ్గు పడ్డాడు.

"చెల్లికి చెయ్యకుండా నీకు చేసేస్తానంటోందా మీ అమ్మ?"

"ఎంబీబీఎస్ అయ్యాక ఎండీ చేస్తుందట. అదయ్యాకగానీ మ్యారేజీ చేసుకోనంటోంది వరం. అవునూ చెల్లి పేరు నీదే కదా బామ్మా" గ్రామస్తుడి మాటలు గుర్తు తెచ్చుకుంటూ అన్నాడు.

ముసిముసిగా నవ్వింది. "మీ నాన్నొట్టి బోళాశంకరుడు. అంచేతే మీ అమ్మ చక్రం తిప్పుతోందిలే"

"అత్త కళ్ళకి ఏ కోడలు మంచిగా కన్పించింది లేమ్మా" నవ్వుతూనే మూతి తిప్పింది అలివేలు.

"నీది మరీ చోద్యం. రాజ్యం నా కోడలు కాదు కూతురేనే. నువ్వెంతో అదీ అంతే. దానిమాట పెళుసు గానీ మనిషి మంచిదే. అవాళలా ఎక్కెయ్యక పోయి ఉంటే..."

ఆవిడ స్వరం వణికింది. కన్నీళ్ళు చిప్పిల్లాయ్. గబగబా తుడిచేసుకుంది.

హేమంత్ మనస్సు చేదుగా అయింది.

"అసలేమయింది బామ్మా?"

అలివేలు ముఖం తిప్పుకుని అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

"చెప్పడానికేమీ లేదురా. వడ్లగింజలో బియ్యపుగింజ!"

ఒకమ్మాయి తొంగిచూట్టం గమనించి పిలిచింది. "ఆ దొంగచూపు లెందుకే. ఇలారా"

ఆమె రాలేదు. మళ్ళీ పిలిచాక నేలచూపులు చూస్తూ వచ్చింది.

"అర్చనరా. చిన్నప్పుడెప్పుడో చూసుంటావు. పొట్లకాయలా సాగింది."

పరికిణీ, ఓణీ, మెడలో చెయిను, చెవులకి జూకాలు, కాటుక కళ్ళు, ఎర్రగా మెరుస్తోన్న బొట్టు, ఒత్తయిన జుట్టు, చేప కళ్ళు... 'బావుందే' అనుకోకుండా ఉండలేకపోయాడు హేమంత్.

"హాయ్" విష్ చేశాడు.

జవాబుగా చేతులు జోడించి నమస్కరించింది.

"మనవరాలని చెప్పటం కాదుగానీ పద్ధతైన పిల్లరా. ఏ పనిచేసినా ఆరిందాలా చేస్తుంది. చక్కగా వండుతుంది ఎంచక్కా వడ్డిస్తుంది. బంధువులంటే ఎంత అభిమానమో చెప్పలేను."

ఇంకా ఏదో చెప్పబోతుంటే బామ్మ వీపు మీద చిన్నగా పొడిచింది.

"ఇంకేం చెప్పన్లే పిల్లా" నవ్వేసిందావిడ.

"కాసేపు నడుం వాల్చరా. ఆనక కబుర్లు చెప్పుకుందాం" అర్చన మీద బరువాన్చి లేచింది బామ్మ.

పడుకున్నాడన్నమాటేగానీ నిద్ర రావట్లేదు హేమంత్‌కి.

డాడీ ఇక్కడికెందుకు రావట్లేదో! కన్నతల్లిని చూట్టానిక్కూడా రానంత కోపాలూ పట్టుదలలూ ఎలా వచ్చాయో. చూస్తుంటే వీళ్ళంతా మంచివాళ్ళలానే ఉన్నారు మరి.

తల్లి గుర్తొచ్చింది. అమెకి పౌరుషం జాస్తి.

"అమ్మకి ఒంట్లో బాగుండటం లేదట. ఇక్కడికి తీసుకొచ్చేద్దాం" ఓసారి మమ్మీతో అన్నాడు డాడీ.

"ఆవిడకి చాకిరీ చెయ్యడం నావల్ల కాదు మీరు చేసుకుంటానంటే తెచ్చుకోండి"

"అది కాదే, కొడుకుని నేనుండగా అమ్మ చెల్లి ఇంట్లో ఉండటం... అంతా ఏమనుకుంటున్నారో ఏమో! నాకుమాత్రం గిల్టీగా ఉంది"

"మీ చెల్లెలేమీ తక్కువది కాదు లెండి. తల్లి ఆస్తి కాజెయ్యొచ్చని ఏదో ఇంత ముద్ద పడేస్తోంది గానీ ప్రేమ కారిపోయి కాదు!"

"ఆ పని మనమే చేద్దాం"

"నాకు కుదరదన్నాగా. ఇంక ఆ టాపిక్ తేవద్దు" ఖరాఖండీగా చెప్పేసింది.

నిస్సహాయంగా చూస్తూండి పోయాడు డాడీ.

అదంతా గుర్తొచ్చేసరికి హేమంత్ గుండె బరువెక్కింది.

అఖరి మజిలీ కొడుకింట చెయ్యాలని ప్రతి తల్లీ తండ్రీ ఆశ పడ్తూంటారు. అలాటిది...! నిట్టూర్చాడు.

భోంచేస్తోంటే పొలాన్నుంచి వచ్చాడు నందనరావు. పిచ్చాపాటీ అయ్యాక తోటల్లోకి తీసుకెళ్ళి అన్నీ చూపించాడు. తీయని కొబ్బరి బొండాం నీళ్ళు తాగి 'అమృతం' అనుకున్నాడు.

ఆ రాత్రి బామ్మ హేమంత్ మంచం మీద కూర్చుని ఎన్నెన్నో కబుర్లు చెప్పింది. కొడుకు చిన్నప్పటి ఊసుల్ని కృష్ణలీలల్లా వర్ణించింది.

మర్నాడు ఎనిమిదిన్నరకే అర్చన హడావుడిగా వెళ్ళటం చూశాడు. పరికిణీ ఓణీగాక డ్రెస్ వేసుకుంది. భుజాన పుస్తకాల బ్యాగ్.

చటుక్కున వీధిలోకెళ్ళి చూశాడు.

చకచకా అడుగులేసుకుంటూ వెళ్ళి దూరంగా ఆగివున్న బస్సెక్కింది ఆమె నడకలో ప్రస్ఫుటమైన ఆత్మవిశ్వాసానికి అబ్బుర పడుతూ బస్సు వంక చూశాడు. దాని మీదో ఇంజినీరింగు కాలేజీ పేరు రాసి ఉంది.

నిన్నటికీ ఇవాళ్టికీ ఎంతో తేడాగా అన్పించింది అర్చన.

ఆడవాళ్ళకెన్ని రూపాలో! ఎన్ని రంగులో! ఎన్ని కళలో!

తల పంకించి చిన్నగా నవ్వుకున్నాడు.

"ఇదిగో హేమంతూ, అంతా దేవుడికి ముడుపు కడతారు – కోరికలు తీర్చాడనో తీరుస్తాడనో. మీ నానమ్మేమో మనవడికి కట్టింది. ఇలాటి చోద్యం ఎక్కడా చూళ్ళేదు!" నవ్వుతూనే బుగ్గలు నొక్కుకుంది అలివేలు.

అత్త ఆట పట్టిస్తోందని అర్థమై తనూ నవ్వేశాడు.

"ఇంతకీ ముడుపు మూట నీకిచ్చిందిటయ్యా. అందులో మణులున్నాయా మాణిక్యాలున్నాయా?" వేళాకోళమాడింది.

"నువ్వేం ఎత్తి పొడవక్కర్లేదు. నా మనవడికి నేనేమీ మూట ఇవ్వక్కర్లేదు. మీలాగా ముసలమ్మ ఆస్తికోసం అర్రులు చాచేవాడు కాదు నా మనవడు. వాడే సంపాదిస్తున్నాడు వేలకువేలు" కరిచినంత పని చేసింది బామ్మ.

"బుద్ధొచ్చింది మనవడి మీద ఈగ వాల్తుందేమో వేయి కళ్ళతో కనిపెట్టుకుండమ్మా" ఉత్తుత్తిగా లెంపలేసుకుంది కూతురు.

"నిజంగానే నీ కోసం ముడుపు కట్టా(న్రా. ఇస్తాను రా..." తను పడుకునే వసారా గదిలోకి హేమంత్ చెయ్యి పట్టుకుని మరీ తీసుకెళ్ళింది.

నవారు మంచం మీద కూర్చోబెట్టి అంది "మీ నాన్నకి నా మీద పీకల దాకా కోపం ఉందిరా. ఎంచేతో నీకేమైనా తెలుసు(ట్రా?"

తల అడ్డంగా ఊపాడు.

"మహానుభావుడు మీ తాత పోయారు. కర్మకాండలయ్యాయి. మీ తాత ఉండగానే ఉన్న పొలంలో సగం మీ నాన్నకి సగం అత్తకీ రాసేశారు. మీ నాన్న వాటా అమ్మేసుకుని మద్రాసులో స్థలాలు కొన్నాడు. నా పేరన మా పుట్టింటివారు పసుపు కుంకాల కింద ఇచ్చిన నాలుగెకరాలుంది. అది అమ్మేసి ఇల్లు కట్టుకుంటానన్నాడు మీ నాన్న. తల్లిపేరనున్న ఆస్తి కూతురికే దక్కుతుందని వాదనేసుకుంది అలివేలు. బోల్డు కట్నకానుకలివ్వడమే గాక ఊళ్ళోనే ఉండటం వల్ల కూతురికెంతో దోచిపెట్టేశామంటూ మీ అమ్మ ఎగదోసింది. మాటా మాటా పెరిగింది. పంతాలకు పోయారు. ఎడముఖం పెడముఖం అయ్యారు. చెరో దారీ పట్టారు. నేను మిగిలిపోయాను!"

"నువ్వు సర్ది చెప్పాల్సింది బామ్మా. డాడీ డబ్బు మనిషి కాదు"

"నాకసలు తెలియనిస్తే గదరా! మీ తాత పోయిన దుఃఖంలో మూలగదిలో ఏడుస్తూ కూర్చున్నాను. వీళ్ళేమో ముందు గదిలో మల్లగుల్లాలు పడ్డారు. కాలు దువ్వుకున్నారు. పోనీ 'ఇదీ సంగతి, నువ్వేమంటావమ్మా' అని నన్నడక్కూడదూ? ఊహూ, వీసమెత్తు కూడా నాకు తెలీనివ్వలేదు. మీరెళ్ళిపోయాక తెలిసింది. గుండెలు బాదుకున్నాను. అలివేలు మీద పిల్లల కోడిలా పడ్డాను. మీ నాన్నకెన్ని ఫోన్లు చేయించానో లెక్కలేదు. ఇటుకేసి తొంగిచూస్తే ఒట్టు. నేనే అలివేల్ని ఎక్కేసి, మీ నాన్న మీదకి ఉసిగొల్పి ఉంటానని మీ నాన్న అనుమానం. అసలా బీజం నాటింది మీ అమ్మేరా. ఇంటికప్పు కింద కూర్చుని చెబుతున్నాను. నాకే పాపం పుణ్యం తెలీదురా...!" వలవలా ఏడ్చేసింది.

"అంత చిన్న కారణానికి విడిపోవడం బాగోలేదు బామ్మా. డాడీకి నేను నచ్చజెప్పి తీసుకొస్తాన్లే" ఆవిణ్ణెలా ఓదార్చాలో తెలియక సానుభూతిగా చూస్తూ అన్నాడు.

"మా నాయనే! మా తండ్రే! ఎంత చల్లని మాట చెప్పావురా. నా ఆయుష్షు కూడా పోసుకుని నూరేళ్ళు చల్లగా వర్ధిల్లరా తండ్రీ" బుగ్గలు నిమిరింది ఆనందభాష్పాలు జలజల రాలిపోతుంటే.

"నా బెంగంతా మీ నాన్న గురించేరా మీ నాన్న గంగిగోవు అంటే నమ్ము. రేపు కాలూ చెయ్యీ వంగేక కాస్తంత ఆసరా ఇవ్వడానికీ ఆప్యాయంగా పలకరించానికీ తోచీతోచక చెప్పే కబుర్లు ఓపిగ్గా వినడానికీ చక్కని కోడలు ఉండాల్రా అలాంటి ఉత్తమురాలు వస్తే మీ నాన్న తనువు హాయిగా గడిచి పోద్దిరా!"

తుళ్ళిపడ్డాడు. ఆశ్చర్యపడ్డాడు.

తన గురించి గాక కొడుకు కోసం తపిస్తోందీ మాతృ హృదయం!

అతడి మనస్సు ఉద్విగ్నభరితమైంది.

"అర్చన నీ పెళ్ళాం అయితే మీ నాన్నకి పెద్ద కూతురవుతుందిరా. నేను నిశ్చింతగా కన్ను మూస్తాన్రా. చేసుకుంటావుట్రా? అప్పుడు నా పొలం మీ ఇద్దరికీ రాసిచ్చేస్తాను. గొడవలూ సర్దుకుంటాయిరా" కళ్ళనిండా ఆశ నింపుకుని అడిగింది.

ఇబ్బందిగా కదిలాడు. తల్లి గుర్తొచ్చింది నీళ్ళు నమిలాడు.

"మేనరికాలు మంచివి కావు బామ్మా?" అతి కష్టం మీద నోరు తెరచి మెల్లగా అన్నాడు.

"మేనరికం కాకపోతే చేసుకుంటావా?"

"కాకపోవడం ఏవిటి?"

"కాదు గనుక!"

సృష్టిలోని ఆశ్చర్యమంతా అతడి ముఖంలో తిష్ట వేసింది.

"మూడోకంటి వాడిక్కూడా తెలీని రహస్యం చెబుతాను. ఎవ్వరికీ చెప్పనని నా చేతిలో చెయ్యి వెయ్యి" లోగొంతుకతో అంది.

వేశాడు.

"మీ నాన్న మా బిడ్డేగాని మాకు పుట్టలేదురా. అలివేలు మూడో నెలప్పుడు మొక్కు తీర్చుకోడానికి తిరుపతి వెళ్లాం. కొండ మీద దొరికాడురా. అప్పటికి వాడికి ఏడాది

నిండి ఉండదు. ఆకలేసి బాగా ఏడుస్తోంటే ఎత్తుకున్నాను. పాలిచ్చి ఊరుకోబెట్టాను. వాడి తాలూకు వాళ్లెవరూ రాలేదు. ఎంత వాకబు చేసినా లాభం లేకపోయింది. దేవుడిచ్చిన బిడ్డ అనుకుని తీసుకొచ్చి సాకాం. ఇద్దర్నీ రెండు కళ్లల్లా చూసుకున్నాం. చెప్పాలంటే మీ నాన్నంటేనే ఒక రవ్వ ఎక్కువ ఇష్టం నాకూ మీ తాతకీనూ. ఈ మాట ఎవ్వరికీ చెప్పకు. నేను చచ్చినంత ఒట్టు. సంగతి తెలిస్తే మీ నాన్న తట్టుకోలేడురా. ఒంటరిగాణ్నని కుమిలిపోతాడు. అది నేను తట్టుకోలేనురా" బావురుమంది బామ్మ.

ఆమె వంక విభ్రాంతిగా, ఆరాధనగా చూస్తూ కళ్లు తుడిచాడు హేమంత్. "యశోదమ్మ ఎలా ఉంటుందో ఇదిగో ఇప్పుడే చూస్తున్నాను బామ్మా"

ఆమె ఒళ్లో తల పెట్టుకుని ఏడ్చేశాడు తనకు తెలీకుండానే.

"ఛ ఛ, ఏడుపేంట్రా ఆడపిల్లలా. ఊరుకో ఊరుకో..." "ఆగి, కళ్ళు తుడుచుకుంటూ" మాటలు బాగానే నేర్చావోరే" అంది మురిపెంగా నవ్వుతూ.

భోషాణం పెట్టె తెరిచి అందులోంచి చిన్న పసుపు గుడ్డ మూటని బయటికి తీసింది.

"మీ నాన్నా అత్తా గొడవ పడి విడి పోయినప్పుడు నీకివ్వటానికి ఈ ముడుపు కట్టాన్రా తీసుకోరా నాన్నా".

పవిత్రమైన అపురూపమైన వస్తువుని అందుకున్నట్టు అందుకున్నాడు.

మూటవిప్పి చూశాడు.

వడ్లగింజలు!

అయోమయంగా చూశాడు.

"భూమిలో చల్లి, కాసిని నీటిచుక్కలు చిలకరిస్తే చాలు... వడ్లు చకచకా మొలకెత్తుతాయిరా. అభిమానాలూ ఆప్యాయతలూ ఈ వడ్లగింజల్లాంటివేరా. వాటిని నువ్వు విత్తాలి. అన్నాచెల్లెళ్ళ మధ్య మళ్ళీ ప్రేమాభిమానాలు మొలకెత్తించాలి. ఆ వరం నాకిస్తావుట్రా?" కన్నీళ్ళతో అర్థించింది.

భగవంతుడి చేతిలో భక్తుడు వేసినట్టుగా బామ్మ చేతిలో చేయి వేశాడు మనవడు.

* * *

(ఈనాడు ఆదివారం 13.12.10)